క్లుప్తంగా

ఘనంగా నూకాంబిక అమ్మవారి జాతర

కంచరపాలెం: స్థానిక ఊర్వశికూడలి పరిధి దేవేంద్రనగర్, రవీంద్రనగర్‌లో వెలసిన నూకాంబిక అమ్మవారు ఆలయంలో కొత్త అమావాస్య జాతర ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయ ధర్మకర్త దేవల కృష్ణరాజు నేతృత్వంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం ఘటాల సంబరాన్ని ఆయన ప్రారంభించారు. కంచరపాలెం మెయిన్‌రోడ్డు నుంచి ఊర్వశికూడలిలో నూకాంబికా ఆలయం వరకు పలు నృత్యాలతో అమ్మవారి విగ్రహంతో పాటు దీపం, బెత్తం, పోతురాజు(కత్తి), జల్లెడ, పూల ఘటాలతో ఊరేగింపుగా సంబరాలు నిర్వహించారు. ఆలయం వద్ద అగ్ని గుండాలు తొక్కి మొక్కు తీర్చుకున్నారు.

నేడు ధ్యానమందిరంలో ప్రత్యేక పూజలు



ఉగాది సందర్భంగా ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలో షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో ఉగాది సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భక్తుల స్వహస్తాలతో సాయిబాబాకు క్షీరాభిషేకం, నవగ్రహారాధన, నవగ్రహ హోమం, సాయంత్రం 5గంటలకు సహస్ర నామార్చన, రాత్రి 7గంటలకు పంచాంగ శ్రవణం, రాత్రి 8 గంటలకు భక్తిగీతాలాపన (భజన)కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక పూజలు మార్చి 30వ తేదీ శ్రీరామనవమి వరకు కొనసాగుతాయని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు.

వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శోభకృత్ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా వైభవునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శ్రీవారికి ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం స్వామిని రజిత కవచధారుడిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఉదయం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30గంటల వరకు ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

ముస్తాబైన దుర్గాగణపతి ఆలయం

సీతంపేట: శోభకృత్ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా దుర్గాగణపతి ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. ఉగాది సందర్భంగా ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, సహస్రనామార్చన జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి దర్శనానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు.

న్యాయ సేవలు అందరికీ చేరువ కావాలి

విశాఖ లీగల్: న్యాయసేవా ప్రాధికార సంస్థ సేవలను ప్రజలందరికీ విస్తరించాలని లోక్ అదాలత్ జిల్లా కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కోర్టులోని లోక్ అదాలత్ భవనంలో వివిధ సేవా సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం లోక్ అదాలత్ అందిస్తున్న సేవలను, సేవా సంస్థల పనితీరును సమీక్షించారు. భారత రాజ్యాంగం, జస్టిస్ కృష్ణయ్య ఆకాంక్షల మేరకు ఏ వ్యక్తి న్యాయ సహాయానికి దూరం కాకూడదన్న లక్ష్యాన్ని సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు సీహెచ్ విశాలాక్షి, వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు పి.కె. లింగేశ్వరరావు, ఎల్డర్‌లైన్ ప్రతినిధి ప్రసాద్, నేచర్ సంస్థ, ఏఎస్‌కె ఫౌండేషన్, లోక్ అదాలత్ ప్యానల్ అడ్వకేట్‌లు పాల్గొన్నారు.

రాగిజావలో పోషకాలు పుష్కలం



రాగిజావ పంపిణీ చేస్తున్న ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు



జీవీఎంసీ హైస్కూల్‌లో కార్యక్రమం ప్రారంభించిన కార్పొరేటర్ ఆళ్ల లీలావతి



మాధవదార ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న కార్పొరేటరు ప్రసాద్

- జగనన్న గోరుముద్దలో రాగిజావ పంపిణీకి శ్రీకారం

సీతంపేట: జగనన్న గోరుముద్దలో భాగంగా పిల్లలకు మరో పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల్లో మంగళవారం ఉదయం రాగి జావను అందించే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. జీవీఎంసీ44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో గల జీవీఎంసీ ఉర్దూ పాఠశాలలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు రాగిజావ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలకు స్వయంగా గ్లాసుల్లో రాగిజావ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి జావ బలవర్ధకమైన ఆహారమని, ఐరన్, కాల్షియం వంటి పోషకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి, స్థానిక నాయకులు హబీబ్, హీరా, తిరపతి, గోపి పాల్గొన్నారు.

25వ వార్డులో...

జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ రాగిజావ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం బి.దేముడుబాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

26వ వార్డులో...

లలితానగర్‌లోని జ్ఞాననికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో స్కూల్ కరస్పాండెంట్ సునీత కుమారి రాగిజావను పంపిణీ చేశారు.

రైల్వేన్యూకాలనీలో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా మంగళవారం నుంచి రాగిజావ పంపిణీ చేసే కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ప్రారంభించారు. జీవీఎంసీ హైస్కూల్‌లో ఇంచార్జి ప్రధానోపాధ్యయురాలు వి.అనురాధతో కలిసి ఈ కార్యక్రమం ప్రారంభించారు. గిరిజ, ఇంద్రాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కేఎస్‌ఎం గర్ల్స్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు రాము, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శారదలతో కలిసి రాగిజావను పంపిణీ చేశారు. రైల్వేన్యూకాలనీ మసీద్ వద్ద గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జి. కృష్ణవేణి, పాఠశాల సిబ్బందితో కలిసి రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాగిజావతో వ్యాధినిరోధక శక్తి

మురళీనగర్: విద్యార్థుల్లో రక్త హీనత తగ్గించి వ్యాధినిరోధక శక్తిని పెంచేందుకు రాగిజావ ఉపయోగపడుతుందని డిప్యూటీ ఫ్లోర్ లీడరు, 49వ వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు అన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా అల్లూరి సీతారామరాజునగర్‌లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఐదో పట్టణ సీఐ విజయకుమార్ , హెచ్‌ఎం ఎస్‌ఎస్‌ఎం సాయిలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం యు.అరుణకుమారి పాల్గొన్నారు.

మాధవదారలో..

మాధవదార జీవీఎంసి ఉన్నత పాఠశాలలో రాగిమాల్ట్ పంపిణీ కార్యక్రమాన్ని 50వ వార్డు కార్పొరేటరు వావిలపల్లి ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, పాఠశాల కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.విజయ్‌కుమార్, పి.రామ్మోహన్, ఏవీఎస్ రాజు, కె.రఘుత్రినాథ్, చిరంజీవి పాల్గొన్నారు.

కంచరపాలెం:

జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలలో వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి రాగి జావ పంపిణీ చేశారు.

జగనన్న గోరుముద్ద అద్భుతం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో జగనన్న గోరుముద్దలో రాగిజావ కార్యక్రమాన్ని కార్పొరేటర సాడి పద్మారెడ్డి ప్రారంభించారు. పీఅండ్‌టీ కాలనీలోని ఎస్‌ఎంసీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న కార్పొరేటర్ కామేశ్వరి



మధురానగర్ స్కూల్‌లో రాగిజావ తాగిస్తున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గోవింద్



రాగి జావ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

ఆర్థిక వ్యవహారాలపై అవగాహన అవసరం



ఆర్‌బీఐ ప్రతినిధులతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

సీతంపేట : బ్యాంకు, డిజిటల్ లావాదేవీలలో అప్రమత్తంగా లేకుంటే మోసపోయే అవకాశం ఉందని రిజర్వు బ్యాంకు మేనేజర్ (హైదరాబాదు) ప్రవీణ్ అన్నారు. జీ20 సదస్సు నేపథ్యంలో ఆర్థిక వ్యవహారాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో జన భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బ్యాంకింగ్ లావాదేవీలలో చాలా మోసాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ లావాదేవీలు, లోన్ యాప్స్‌లో ఏవిధంగా మోసాలు జరుగుతున్నాయో వివరించారు. ఎక్కడ పెట్టుబడులు పెట్టాలి, భవిష్యత్‌లో వాటివల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ స్థాపన, విధులు, ఆర్‌బీఐలో ఉద్యోగావకాశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ప్రతినిధులు, మధుసూదన్, రోహన్, జయంత్, కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, విభాగాధిపతులు బి. శ్రీనివాసరెడ్డి, ఎన్.కె. మహేష్, జె.లక్ష్మణబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి లలితాపీఠంలో వసంత నవరాత్రులు

సీతంపేట: శోభకృత్ నామ సంవత్సరం, శ్రీరామనవమి సందర్భంగా అక్కయ్యపాలెం లలితాపీఠంలో వసంత నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం నుంచి 30వ తేదీ వరకు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. బుధవారం ఉగాది సందర్భంగా లలితా పరమేశ్వరికి క్షీరాభిషేకం, సాయంత్రం నారాయణ బృందంచే నాదస్వర కచేరి, 7 గంటలకు రొంపిచర్ల సింగరాచార్యులచే పంచాంగ శ్రవణం, 8 గంటలకు తిరుమల పెద్దింటి నరసింహాచార్యులచే రామాయణ విశేషాల ప్రవచనం జరుగుతుందన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు రాజశ్యామల హోమం, 24వ తేదీ ఉదయం 10 గంటలకు షోడశ మహామంత్ర హోమం జరుగుతుందని తెలిపారు. 25వ తేదీ ఉదయం హరిద్ర గణపతి హోమం, 26న ఉదయం శ్రీచక్ర నవావరణ అర్చన సహిత ఆవరణ హోమం, 27న ఉదయం సుబ్రహ్మణ్య హోమం, 28వ తేదీ సాయంత్రం మన్యు పాశుపత హోమం, 29న శ్రీవారాహిదేవి హోమం, 30వ తేదీ ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని తెలిపారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిని సత్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: సనాతన ధర్మాన్ని, సంప్రదాయాన్ని , సాంస్కృతిక వారసత్వాన్ని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరం ప్రజలందరికీ శుభాలను కలగజేస్తుందన్నారు. సహృదయ సాహితి అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో చైత్రశుద్ధ పాడ్యమి నాడే సృష్టి ఆరంభం అయిందని అన్నారు. ప్రతి ఉగాది మనలో నైరాశ్యాన్ని పారదోలి కొత్త ఆశలు చిగురించేలా చేస్తుందన్నారు. ప్రముఖ రచయిత ఎల్.ఆర్.స్వామి మాట్లాడుతూ కవిత్వం కలకాలం నిలవాలంటే కవులు కవిత్వాన్ని అభ్యసించి లోకాన్ని అవలోకించి బాధ్యతగా రచనలు చెయ్యాలన్నారు. పలువురు కవుల రచనలను రచయిత కేజీ వేణు సమీక్షించారు. ఈ కవి సమ్మేళనంలో గరిమెళ్ళ నాగేశ్వరరావు, డీవీ సూర్యారావు, చిన సూర్యనారాయణ, ఉప్పల అప్పలరాజు, గుండాన జోగారావు, కొత్తూరి రమణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, కె.వి.ఎస్.మూర్తి, రామాతాత తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు ఏర్పాట్లు

మురళీనగర్ : మురళీనగర్ ఆలయాలతో పాటు పార్కుల్లో ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాకర్స్ పార్కులో బుధవారం సాయంత్రం శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తామని పార్కు అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చెప్పారు. సాయంత్రం 5.30 గంటలకు సుసరావు చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఉంటుంది. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా హాస్యరంగ సామ్రాట్, వికటకవిగా బిరుదులు పొంది, గంటలో 654 జోకులతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన కోరుకొండ రంగారావు బృందంచే హాస్య వల్లరి (వెయ్యి నవ్వుల హరివిల్లు) కార్యక్రమం ఉంటుంది. మాచిరాజు నారాయణరావు ఇందుకు అవసరమైన సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు.

వైశాఖి స్పోర్ట్సు పార్కులో..

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఆ పార్కు సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5గంటల నుంచి ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు ననపల వరప్రసాద్‌చెప్పారు. అయిలూరి శ్రీనివాసరదీక్షితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, డాక్టర్ రహమ్‌తులా బృందం ఘంటసాల గానావదానం, నటరాజ కళానికేత్ విద్యార్థుల భరత నాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయి.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి



ఏపీఈపీడీసీఎల్ సీఎండీతో చర్చిస్తున్న గొండు సీతారాం

సీతమ్మధార : ఏప్రిల్ మూడో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదోతరగతి పరీక్ష కేంద్రాలకు అనుబంధంగా ఉన్న ప్రాంతాలలో ఎటువంటి విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. ఈ మేరకు మంగళవారం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావుతో ఆయన భేటి అయ్యారు. సంస్థ పరిధిలో ఎన్ని జిల్లాలున్నాయి? పరీక్ష కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకున్నారు. ఆ మేరకు ఆ ప్రాంతాల్లో పరీక్ష జరిగే జరిగే సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా సీఎండీ సంతోషరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష కేంద్రాలకు ఎటువంటి విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారిణి శ్రీలత, లావణ్య, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు రజని, కనకలక్ష్మి, శిరీష, సీఆర్పీఎఫ్ ప్రతినిధులు డా.బి.శకుంతల, పి.శేఖర్, డా.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించలేదని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు వెంకటేష్

సీతమ్మధార : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫోర్తు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వేన్యూకాలనీలో పువ్వల వెంకటేష్ (26) నివాసం ఉం టున్నాడు. తాటిచెట్లపాలెం, ఫ్రెష్ చాయిస్‌లో పనిచేస్తున్నాడు. ఓ యువతి తన ప్రేమను నిరాకరించడంతో మనస్తాపానికి గురై సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో ఫోర్తు టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ మోహన్‌రావు ఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణం రేపు



భద్రావతి సమేత భావనారుషి స్వామి

సీతంపేట: పద్మశాలి కులస్తుల కులదైవం భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం సీతంపేటలో గురువారం ఉదయం 9.58 గంటలకు నిర్వహిస్తామని శ్రీభక్తమార్కెండేయ పద్మశాలి సేవాసంఘం సీతంపేట శాఖ అధ్యక్షులు గుదేరాజు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో తొలిసారిగా సీతంపేటలో దుర్గాగణపతి ఆలయం వెనుక రోడ్‌లో గురువారం ఉదయం అంగరంగ వైభవంగా కల్యాణం జరుగుతుందన్నారు. 200 మంది పద్మశాలి దంపతులు కల్యాణంలో పాల్గొంటారని, రాజమండ్రికి చెందిన ఆమంచి ఆంజనేయ గురు స్వామి నేతృత్వంలో కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరిపించడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. కళ్యాణం అనంతరం సుమారు ఐదు వేల మందికి అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు సీతంపేట పురవీధుల్లో భద్రావతి సమేత భావనా రుషి స్వామి వార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణాన్ని వీక్షించి, అన్నప్రసాదం స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అందరికీ శుభం కలగాలి



అదనపు కమిషనర్‌ను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్, వీజేఎఫ్ బృందం

దాబాగార్డెన్స్: షడ్రుచుల ఉగాదితో ప్రారంభమయే శోభకృత్ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్, వీజేఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది శోభకృత నామ సంవత్సర ఉత్సవాలు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి అందరికీ మంచి జరగాలని అభిలషించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ సమాజ పరివర్తనకు ఇటువంటి పండగలు దోహదపడతాయన్నారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయలకు ఉగాది కిట్లు అందజేశారు. అదనపు కమిషనర్ శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజ్ పట్నాయక్, దాడి రవికుమార్, ఎంఎస్ఆర్ ప్రసాద్, ఈశ్వరరావు, బ్రహ్మకుమారి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ రద్దు కోరుతూ భారీ ర్యాలీ



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు, రైల్వే ఉద్యోగులు

తాటిచెట్లపాలెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న న్యూ పెన్షన్ స్కీంకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జనరల్ సెక్రటరీ పీకే పట్నాహాని పిలుపుమేరకు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. విశాఖ రైల్వే స్టేషన్ నుంచి దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. కొత్త పెన్షన్ విధనాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, రైల్వేలో జరుగుతున్న ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతికి వనతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ఎస్ రావు, డివిజనల్ కో ఆర్డినేటర్ పీవీజే రాజు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్స్ ఏ కె పాఢి, పీఆర్‌ఎం రావు, ఏఐఆర్‌ఎఫ్ నాయకులు బి.దామోదరరావులతో పాటు అధిక సంఖ్యలో వివిధ విభాగాల నుంచి వచ్చిన రైల్వే కార్మికులు పాల్గొన్నారు.